మన మీ..
# వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం
28 ఆగస్టు 2026

పేజీలు : 4

@mvaartanews

www.mivaartanews.com

# చెట్లే మానవాళికి జీవనాధారం.

– వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

ఖమ్మం, ఆగస్టు- 27,మీ వార్త ప్రతినిధి.

మానవాళి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు చెట్లే ప్రధాన జీవనాధారమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో నిర్వహించిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితికి వాతావరణ సమతుల్యత దెబ్బతినడమే కారణమన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే మనం ఇచ్చే నిజమైన కానుక అని తెలిపారు.నాటిన ప్రతి మొక్కను చెట్టుగా మారే వరకు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు దత్తత తీసుకున్నట్లు సంరక్షించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ పచ్చదనం పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా



శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత.

– రూ.30 లక్షలతో గోపాలపురం పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి.

ఖమ్మం, ఆగస్టు -27మీ వార్త ప్రతినిధి.

విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధి గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించేందుకు టీచర్ సుమారు రూ.40 వేల సొంత డబ్బును వెచ్చించడం అభినందనీయమని అన్నారు. పిల్లల సంక్షేమం కోసం తన సొంత డబ్బును ఖర్చు చేసి తాత్కాలిక వసతి ఏర్పాటు చేసిన టీచర్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా విద్య, వైద్య రంగాలను అత్యంత ప్రాధాన్యతా రంగాలుగా భావించి పనిచేస్తోందని మంత్రి అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామని, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక ఏటిసి ఏర్పాటు చేస్తున్నామని





మంత్రి తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలతో కూడిన కోర్సుల్లో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటిసి లను దూరదృష్టితో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.తిరుమలాయపాలెం మండలంలో వైద్య రంగానికి కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్త ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి అన్నారు. గత రెండున్నరేళ్లలో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నా మని, కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నా మని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలో ఇళ్లను మంజూరు చేశామని, ప్రస్తుతం రెండో దశ ఇళ్లను అందిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని స్పష్టం చేశారు.కొత్త పింఛన్ల మంజూరు కోసం ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గోపాలపురం పాఠశాల భవనం అత్యంత దెబ్బతిన్న స్థితిలో ఉందని, మరమ్మతులు చేపట్టే అవకాశం లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో ఈ పాఠశాలను చేర్చలేదని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, ప్రస్తుతం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.పాఠశాలలో విద్యార్థుల కోసం టీచర్ సుమారు రూ.30 వేల సొంత నిధులతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు. టీచర్ సేవాభావాన్ని మంత్రి అభినందించారని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ ధర్నా సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇస్తున్న జెఏసి నాయకులు.




ఖమ్మం, ఆగస్టు 27,మీ వార్త ప్రతినిధి.

జేఏసీ పక్షాన నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన మహాధర్నాలో జేఏసీ పక్షాన నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన మహాధర్నాలో టిఎస్జిఆర్ఈఎ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పక్షాన వివిధ మండలాల నుండి సత్తుపల్లి పెనుబల్లి కల్లూరు ఏన్కూరు తల్లాడ వైరా ఎర్రుపాలెం మధిర నేలకొండపల్లి కూసుమంచి ఖమ్మం నగరంలోని కమాన్ బజార్ యూనిట్ గాంధీ చౌక్ యూనిట్ నెహ్రూ నగర్ యూనిట్ మరియు రూరల్ ప్రాంతానికి చెందినవారు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వెంకటేశ్వర్లు,రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు వి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్స్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు జిల్లా నాయకులు అందరూ అత్యధిక సంఖ్యలో 528 మంది మన సంఘ పక్షాన హాజరు కావడం పట్ల జిల్లా శాఖ పక్షాన ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఇదే స్ఫూర్తితో సెప్టెంబరు ఒకటో తారీకున జరిగే పెన్షన్ విద్రోహ దినం అదేవిధంగా సెప్టెంబర్ 10వ తారీఖున చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఇంకా ఎక్కువ



సంఖ్యలో మన పెన్షనర్స్ ఉండే విధంగా జిల్లా మండల నాయకులు కృషి చేయాలని ఈ రోజు విజయవంతం చేసిన ప్రతి మండల శాఖ బాధ్యులకు జిల్లా బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.మన సంఘ పక్షాన 20 మంది మహిళా పెన్షనర్స్ పాల్గొన్నందుకు మహిళా మండలి అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ఉద్యమాభినందనలతో.ఎం సుబ్బయ్య. టి వేణు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శి.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం



సత్తుపల్లిఆగస్టు 27మీవార్త అర్ సి



సత్తుపల్లిజర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఽఙఆఆ) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సత్తుపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.సత్తుపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పాదయాత్ర బృందానికి బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా కూసంపూడి మహేష్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి సేవ చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ బెల్లంకొండ రాము, చాంద్ పాషా, మల్లూరి అంకంరాజు, పర్వతనేని వేణు, గుండ్ర రఘు, నడ్డి ఆనందరావు, మీదే శ్రీను, అక్షింతల చంటి, మరికంటి శ్రీను, మేకల నర్సింహారావు, షేక్ బాబు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ రెండో దశపై బీఎల్ఓలు,బీఎల్ఏలకు అవగాహన



సత్తుపల్లి, ఆగస్టు 27మీ వార్త టౌన్ రిపోర్టర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) రెండో దశపై సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డులకు చెందిన బీఎల్ఓలు, బీఎల్ఏలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్తుపల్లి యూపీఎస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల వివరాల సవరణ, పరిశీలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమలపాషా, మున్సిపల్ కమిషనర్ నరసింహ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పాదయాత్రలో వేంసూర్ నాయకులు



సత్తుపల్లిఆగస్టు 27 మీ వార్త అర్ సి

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాదయాత్రలో వేంసూరు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.తల్లాడ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల మీదుగా జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు సాగారు. ఈ సందర్భంగా వేంసూరు సర్పంచ్ ఫక్రుద్దీన్, వైస్ సర్పంచ్ ఏడుకొండలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లెల్లి నరసింహస్వామి, కాంగ్రెస్ నాయకులు వేల్పుల నవకుమార్, మక్కా శ్యాంబాబు, పిల్లి పుల్లారావు, కొట్టేటి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాదయాత్రలో పాల్గొని జర్నలిస్టులకు మద్దతు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని నాయకులు తెలిపారు.

## సమస్యలు సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాము

- జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నలో గళమెత్తిన సత్తుపల్లి
- విశ్రాంత ఉద్యోగులు

సత్తుపల్లి ఆగష్టు 27మీ వార్త అర్ సి





సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సాధించడం కోసం జిల్లా కేంద్రం ఖమ్మంలో గురువారం జేఏసి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ నాయకులు పాల్గొని తమ గళం వినిపించారు. పెండింగ్‌లో ఉన్న ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబించడం పట్ల సంఘ నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఆరు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ నివేదిక తయారయి మూడు సంవత్సరాలు గడచినా ఇంకా నివేదికను కమిటీ ప్రభుత్వానికి అందచేయలేదు. హెల్త్ కార్డుల విషయంలో నిబంధనలు మారుస్తూ ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు తమపై ఆధారపడిన తల్లిదండ్రులకు వైద్య సదుపాయం నిరాకరించడం దారుణం. సమస్యల పరిష్కారం కోసం మూడేళ్ళు వేచి చూసాము. ఇక ఆగే ప్రసక్తి లేదు. దశల వారి ఉద్యమానికి సిద్దంగా ఉన్నామని సత్తుపల్లి యూనిట్ నాయకులు తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సత్తుపల్లి యూనిట్ నాయకులు కేశవరెడ్డి, ఏ.యస్.ప్రకాశరావు, డి.కృష్ణయ్య, సాంబశివరెడ్డి, సుందరరావు,యోగానంద్, ప్రభుదాసు,జి.కృష్ణయ్య, బూరుగుదాసు,రత్తయ్య,బాలశౌరి,సత్యనారాయణ రెడ్డి,గౌడెల్లి వెంకటేశ్వరరావు,లక్ష్మినారాయణ,మధుసూదన రాజు, ప్రసాద్,రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.ది

## మణుగూరులో గ్యాంగ్ వార్..

- గ్రౌండ్‌లో గ్యాంగ్ దాడి.. యువకుడి మృతి.
- మద్యం మత్తులో విచక్షణ కోల్పోతున్న యువత.
- గ్యాంగ్ వారితో ఉలిక్కిపడ్డ మణుగూరు.







**మణుగూరు ఆగస్టు 27 మీవార్త ప్రతినిధి :** సింగరేణి ఏరియాలోని గ్రౌండ్స్‌లో యువకుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది. మణుగూరులోని గాంధీబొమ్మ ప్రాంతానికి చెందిన యువకులు, కాలనీకి చెందిన ఎంకే గ్యాంగ్ యువకుల మధ్య వివాదం చెలరేగినట్లు సమాచారం, బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం.. సుమారు 25 మంది ఎంకే గ్యాంగ్‌కు చెందిన యువకులు గ్రౌండ్‌లోకి వచ్చి, చొక్కాలు విప్పి దూసుకెళ్లి గాంధీబొమ్మ ప్రాంతానికి చెందిన యువకులపై దాడికి పాల్పడ్డారు. చెట్టు కింద పలువురిని మూకుమ్మడిగా కొట్టిన దృశ్యాలు కూడా చిత్రీకరించబడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివ అనే యువకుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియోల్లో కనిపిస్తున్న వారందరినీ గుర్తించి అదుపులోకి తీసుకుని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. అసలు ఘర్షణకు దారితీసిన కారణాలు, దాడిలో పాల్గొన్న వారి సంఖ్య, శివ మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.

## ముసాయిదా జాబితాలో పేర్లు లేని ఓటర్లు నమోదు చేసుకోవాలి: గాదె పాడు గ్రామ సర్పంచ్



కారేపల్లి ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి

సర్ ప్రక్రియలో భాగంగా ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఓటర్లు తమ ఓటు ఉండేలా నమోదు చేసుకోవాలని గాదె పాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అన్నారు. సింగరేణి మండల పరిధిలోని గాదపాడు గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మ్యాపింగ్ కానీ ఓటర్లు ఎవరైనా ఉంటే కుల సర్టిఫికేట్ ఓటరుకు తల్లి లేక తండ్రి సర్టిఫికెట్ సంబంధిత బిఎల్ఓ కు ఇవ్వవలసి ఉంటుందన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఒక్క ఓటరు గ్రామపంచాయతీ ఆఫీస్ లో ముసాయిదా ఓటర్ లిస్టు ఉంచడం జరిగింది వారి యొక్క పేర్లు నమోదు చేశారా లేదా తెలుసుకోవాలన్నారు. పంచాయతీ ఆఫీసుకు వచ్చి ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారు మరలా కొత్తగా ఫామ్ సిక్స్ ఫారం ఫిల్ అప్ చేసి ఓటు నమోదు చేయించుకోగలరు మరియు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఆఫీస్ వద్దకు వచ్చి వారి యొక్క ఆధార్ కార్డులు టెన్త్ సర్టిఫికెట్ రెండు పాస్ ఫోటోలు కుటుంబంలో ఒకరిది ఓటర్ ఐడి జిరాక్స్ జత చేసి ఆ యొక్క ఫారాలని బిఎల్ఓ కు సమర్పించిన ఎడల వారికి కూడా ఈ యొక్క కొత్త ఓటర్ లిస్టులో జాబితాలో పేరు చేర్చడం జరుగుతుంది. అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో శ్రీనివాసరావు ఉప సర్పంచ్ నన్నెబోయిన ఉపేందర్ వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు అన్ని పార్టీలు సంబంధించిన ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కదం తొక్కిన కమలదళం.

- ఉద్రిక్తంగా మారిన జెడ్పీ సెంటర్ ఆందోళన.
- పోలీసుల ఈడ్చివేత, నెల్లూరి కోటేశ్వరరావు సహా నేతల అరెస్ట్.

ఖమ్మం, ఆగస్టు 27,మీ వార్త ప్రతినిధి.



రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగరంలో భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జెడ్పీ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. పరిస్థితి అదుపుతప్పడంతో రోడ్డుపై బైఠాయించిన నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకువెళ్లి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడంతో ఖమ్మం జెడ్పీ సెంటర్ రణరంగాన్ని తలపించింది.
విద్యార్థుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన, దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లో ఎక్కించారు. ఈ అరెస్టుల పర్వంతో ఖమ్మం నగరంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా నీరుగారుస్తోందని ఆయన మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేపీ గత నెల రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా కళాశాలలకు కనీస నిర్వహణ నిధులు అందక, విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో చదువు పూర్తయినా ఉద్యోగాలకు వెళ్లలేక యువత రోడ్డున పడుతోందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామనుకున్న నాయకులను నిజాం కాలం నాటి తరహాలో గృహనిర్బంధాలు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. పాలకులు తమ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే కళ్లు తెరిచి పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులను సైతం రోడ్ల మీద తిరగనివ్వబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పరిపాలన చేతకాకపోతే తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి లోకం కన్నెర్రజేస్తే కాంగ్రెస్ సర్కారు ఆ యువత ఆగ్రహ జ్వాలల్లో కాలిపోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అండ ఉన్న రాష్ట్రాల్లోనే ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని, తెలంగాణలోనూ ఆ మార్పు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్,నున్న రవి కుమార్, అల్లిక అంజయ్య,కొణతం లక్ష్మినారాయణ,నకిరేకంటి వీరభద్ర, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, శాసనాల సాయిరాం,పమ్మీ అనిత, ఆర్ వి ఎస్ యాదవ్,రుద్ర గాని మాధవ్ బి.కొండ శ్యామ్, శ్రీ లక్ష్మీ రెడ్డి,ఫణి కుమారి,స్వర్ణ, భద్రం, గోనెల శివ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో ఎస్ఐఆర్‌పై గ్రామసభ.. గ్రామస్తులకు అవగాహన



**దమ్మపేట ఆగష్టు 27 మీ వార్త ఆర్సి శ్రీనివాసరావు వనమాల:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు పెడుతున్న సందర్భంగా దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మరియు దమ్మపేట తహాశీల్దార్ మద్దినేని మురళి, సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన దమ్మపేట పంచాయతీ పరిధిలో గల బి.ఎల్.ఓ లు, ఆశాలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులతో, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.ఎల్.ఓ ల సూపర్వైజర్ జి. పి. ఓ నరసింహారావు మాట్లాడుతూ ప్రతీ బి.ఎల్.ఓ తో గత రెండు నెలలుగా సర్ పక్రియ చేపట్టిన పనుల వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. అందులో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా, తప్పుల సవరణ, అనర్హుల తొలగింపు, మరణించిన వారి పేర్లు, ఊరు మారిన వారి వివరాలు, డబల్ ఎంట్రీ ఒకరి కంటే ఎక్కువ ఓట్లు తదితర. తహాశీల్దార్ మురళీ మాట్లాడుతూ అక్టోబరు 1 వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతకు కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా అవకాశం ఉంది అన్నారు, సర్ పక్రియలో ఊర్లో ఉండి ఫారం ఇవ్వని వాళ్ళ ఓట్లు పోయి ఉంటే వారు ఓటు నమోదు చేసుకోవచ్చు అన్నారు. తొలగించిన ఓట్లు వివరాలను పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతున్నాం అన్నారు. ఓటర్ల తొలగింపు తాలుఖా వివరాలను పార్టీల వారు జిరాక్స్ అడగగా ఇస్తాము అన్నారు. సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైనది అని అర్హుల అయిన వారి ఓట్లు పోకుండా చూడాల్సిన బాధ్యత బి.ఎల్.ఓ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులది అయిన మన అందరి పై ఉంది అన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యత కల్గి ఉండాలి అని, ఇప్పటికీ ప్రజలు ఫారంలు తెచ్చి ఇస్తున్నారు అని, పంచాయతీ పరిధిలో సుమారు 1500 ఓట్లు సర్ పక్రియలో భాగంగా తొలగించబడ్డవి అని, ప్రజలు బాధ్యతగా ఫారములు నింపి ఓటును పోకుండా జాగ్రత్త పడాలి అన్నారు. సమావేశంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ సర్ పక్రియలో అవకాశం ఉంటే వీధి లో ఉన్న ఇండ్లలలో ఓటర్లను వరుస క్రమంలో వచ్చే విధంగా లిస్ట్ తయారు చేయాలి అని, జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఒక ఇంటిలో ఓట్లు పలు వార్డుల్లో, కొందరి ఓటు డబల్ ఉండటంతో రెండు వార్డుల్లో ఉన్న కారణంగా చాలా ఇబ్బందులు వచ్చాయి అని సరి చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. సమావేశం కు రాని బి.ఎల్.వో పై షోకాజ్ నోటీసు ఇవ్వాలని తహాశీల్దార్ ఆదేశం జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ 7 పోలింగ్ బూత్ లలో సర్ పక్రియలో చేసిన పనిలో బి,ఎల్.ఓ ల కృషి అభినందనీయం అన్నారు. ఇంచార్జీ కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, ఉయ్యాల లక్ష్మినారాయణ, ధర్మసోతు పద్మ, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, పాకనాటి శ్రీను, పసుమర్తి మల్లిఖార్జునరావు, దాసరోజు రామబ్రహ్మం, తాళ్ళ శంకర్, షేక్ గోరె, కారుమూరి సతీష్, అన్నవరపు నాగేంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం





- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పినపాక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇరిగేషన్ మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సభాస్థలి, డెలివరీ పాయింట్, హెలిప్యాడ్ ప్రాంతాలను తనిఖీ చేశారు.

**ప్రధాన పరిశీలనాంశాలు:**

సభాస్థలి పరిశీలన: గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించి, హాజరయ్యే ప్రజలు, నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు పకడ్బందీగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. డెలివరీ పాయింట్ తనిఖీ: మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ వద్ద జరుగుతున్న పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుని, ప్రారంభోత్సవానికి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

హెలిప్యాడ్ ఏర్పాట్లు: మంత్రుల రాక కోసం మారెళ్లపాడులో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రూట్ మ్యాప్ సమీక్ష: మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి, మార్గమధ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు మరియు అధికారులను కోరారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీ గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన మాదారం పెద్ద చెరువు

## అలుగు బ్రిడ్జి,చెరువు కట్ట రోడ్లకు తక్షణమే మరమ్మతులు





**- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్**

**కారేపల్లి 27 మీ వార్త ప్రతినిధి**

మాదారం పెద్ద చెరువు అలుగు వరదలకు గండి పడటంతో రైతులకు గ్రామస్తులకు ప్రమాదకరంగా మారిన అధికారులు పట్టించుకోవడం లేదని మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ అన్నారు సింగరేణి మండలం, మాదారం గ్రామపంచాయతీ గుంపెల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మాదారం గ్రామపంచాయతీ పెద్ద చెరువు అలుగు బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారింది. దీనితో పాటు చెరువు కట్టపై రోడ్లు కూడా పాడైపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.?ఈ క్రమంలో దెబ్బతిన్న అలుగు బ్రిడ్జిని మరియు కట్ట రోడ్లను సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ బృందం నేరుగా పరిశీలించింది. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీమాట్లాడుతూ, చెరువు అలుగు బ్రిడ్జి కూలిపోయే స్థితికి చేరుకున్నప్పటికీ, కట్ట రోడ్లు గుంటలు తేలి అధ్వానంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రమాదకరంగా మారిన అలుగు బ్రిడ్జికి తక్షణమే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, లేదా ప్రత్యామ్నాయంగా కొత్త నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, చెరువు కట్టపై ప్రయాణికుల రాకపోకల భద్రత కోసం వెంటనే డాంబర్ లేదా సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు.?స్థానిక గ్రామపంచాయతీల సర్పంచులు, సింగరేణి నియోజకవర్గ ఎమ్మెల్యే బానోత్ రాందాస్ నాయక్, ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ పెద్దలు తక్షణమే స్పందించి ఈ సమస్యపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే వర్షాకాలంలో భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.?ప్రభుత్వం స్పందించి తక్షణ నిర్మాణాలు చేపట్టని పక్షంలో, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె తీవ్రంగా హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సీనియర్ నాయకులు గూగుల్ తేజ నాయక్, సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్, మండల నాయకులు పులకాని సత్తి రెడ్డి, రావుల నాగేశ్వరరావు, కోయిల శ్రీనివాస్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# ఖమ్మం గడ్డపై ఉద్యోగుల మహాగర్జన.

**- 5,000 మంది ఉద్యోగుల ఐక్య నినాదంతో విజయవంతమైన టీజీఈజెఏసి మహాధర్నా.**

**- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ.**

**ఖమ్మం, ఆగస్టు 27,మీ వార్త ప్రతినిధి.**

ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ఆర్థిక మరియు సర్వీస్ ప్రయోజనాల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ టీజీఈజెఏసి ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయం ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన మహాధర్నా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలకు చెందిన సుమారు 5,000 మంది ఉద్యోగులు భారీగా హాజరై తమ ఐక్యతను, సంఘటిత శక్తిని చాటారు. మహాధర్నాకు టీజీఈజెఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జిల్లా కన్వీనర్ శ్రీ కొంగర వెంకటేశ్వరరావు సమన్వయం చేశారు. వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపి వారికి ఆర్థిక, సేవా, ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని టీజీఈజెఏసి నాయకులు కోరారు అని,2వ పే రివిజన్ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించి, నిర్ణీత గడువులోగా అమలు చేయాలి అని పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి అని సుమారు రూ.10,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను త్వరితగతిన చెల్లించాలి అని,విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలి, ఉద్యోగుల ఆరోగ్య పథకం ను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. టీజీఈజెఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా ఉద్యోగులు మరోసారి తమ ఐక్యత, క్రమశిక్షణ, సంఘటిత శక్తిని చాటారని అన్నారు.సుమారు 5,000 మంది ఉద్యోగులు ఒకే వేదికపైకి వచ్చి మహాధర్నాను విజయవంతం చేయడం ఉద్యోగుల ఐక్యతకు గొప్ప నిదర్శనమన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్క శాఖకు, ఏ ఒక్క సంఘానికి సంబంధించినవి కావని, మొత్తం ఉద్యోగ వర్గానికి సంబంధించిన సామూహిక సమస్యలని ఆయన పేర్కొన్నారు. పునరుద్ధరణ వంటి అంశాలు ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక భద్రత, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాలపై ఉద్యోగుల్లో ఆవేదన ఉందని, ఆ ఆవేదనను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో అర్థం చేసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.



ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సేవలందించేది ఉద్యోగ వర్గమే. అదే సమయంలో ఉద్యోగుల న్యాయమైన సమస్యలు కూడా పరిష్కారం కావాలని కోరుకోవడం సహజం. ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నాం" అని శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు.ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేసుకుని, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.మన సమస్యలపై మనమంతా ఒక్క గొంతుగా మాట్లాడితేనే మన విన్నపానికి మరింత బలం వస్తుంది. ఐక్యతను కాపాడుకుంటూ, క్రమశిక్షణతో, ప్రజాస్వామ్య పద్ధతిలో మన న్యాయమైన హక్కుల సాధన కోసం ముందుకు సాగుదాం" అని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడితే ఉద్యోగ వర్గాల్లో మరింత నమ్మకం, ఉత్సాహం పెరుగుతుందని ఆయన అన్నారు.ఈ రోజు ఉదయం కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 5,000 మంది ఉద్యోగులు, పెన్షనర్లు హాజరు కావడం వారి ఆవేదనను తెలియజేస్తోందన్నారు.ఇదే ఉత్సాహంతో వచ్చేనెల 10వ తారీఖున హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి ఖమ్మం నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారమే మన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు.ఉద్యోగుల ఆర్థిక, సేవా, పెన్షన్, ఆరోగ్య సంబంధిత సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాల మధ్య సమన్వయం, ఐక్యత అవసరమన్నారు. పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.ఉద్యోగుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి.మహాధర్నా అనంతరం కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ మధ్యాహ్నం 2 గంటలకు మహాధర్నా ముగిసిన అనంతరం కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు భారీ ర్యాలీగా ఖమ్మం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు.అనంతరం టీజీఈజెఏసి ఖమ్మం జిల్లా నాయకులు, వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ ని కలిసి



ఉద్యోగుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని నాయకులు వ్యక్తం చేశారు.ఈ మహాధర్నా కార్యక్రమానికి పెన్షనర్స్, టిఎస్ యుటియాఎఫ్, టి పి టి ఎఫ్,మున్సిపల్ ఫోరం, ఇరిగేషన్ ఫోరం తదితర సంఘాలు భారీ ర్యాలీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు.ధర్నా కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులకు రెవెన్యూ అసోసియేషన్ తరపున శ్రీ టి.సునీల్ రెడ్డి, టీ, స్నాక్స్,వాటర్ బాటిల్స్అందించారు.ఈకార్యక్రమంలో టీజీఈజెఏసి నాయకులు టి.సునీల్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, కట్ట.శేఖర్,రంగారావు,రాయల నరసింహారావు ,ఎస్.కే. రంజాన్, దుర్గా భవానీ,రాజేష్,విజయ్, వెంగలరావు,మోదుగు వేలాద్రి, కొణిదేన శ్రీనివాస్,ఎం. సుబ్బయ్య, టి. వేణు,వీరస్వామి, మల్లెల రవీంద్ర ప్రసాద్,యలమద్ది వెంకటేశ్వర్లు(వై.వి).,బిక్కు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, వేంకటపతి రాజు, ధరావత్ రాములు, మట్టా శ్రీనివాస్,సింగారపు వేణు,నాగిరెడ్డి, కరంచంద్, పరిష పుల్లయ్య,శేషు ప్రసాద్, పుష్ప రాజ్, రాంబాబు, ఉషశ్రీ, సుధారాణి, విజయ కుమారి, జెడ్.ఎస్. జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, బి.చంద్రశేఖర్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకరాచారి, కోటపాటి రుక్మారావు, అశ్లాం, జిలాని, గఫూర్, మృదుల, రాధికా రెడ్డి, లలిత కుమారి, విజయ, శ్రీధర్ సింగ్, వీరన్న, ప్రసాద్, నాగుల్ మీరా, గురుమూర్తి, కోమలి, తదితరులు పాల్గొన్నారు.

## 30న జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు.

**ఖమ్మం, ఆగస్టు 27,మీ వార్త ప్రతినిధి.**





గోపాలపురం: ఈ నెల 30న గోపాలపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాస్థాయి అండర్-19 బాలురు, బాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు టి. వీరన్న తెలిపారు.ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను అదనపు కలెక్టర్ రెవెన్యూ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి డీఈఓ డి. సదానందం చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లాస్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో అండర్-19 బాలురు, బాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్, టోర్నమెంట్ నిర్వహణ కమిటీ సభ్యులు టి. వీరన్న, పి. శివకృష్ణ, పి. మనీష్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఇతర పూర్తి వివరాల కోసం 7075326296, 8328102378 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు.

**ఖమ్మం, ఆగస్టు 27,మీ వార్త ప్రతినిధి.**




ఖమ్మం నారాయణ పాఠశాలలో రాఖీ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఎంతో ఘనంగా మరియు ఆనందోత్సాహాలతో నిర్వహించారు.భారతీయ సంస్కృతి,సంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర,సోదరీ బంధం యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పారు.రాఖీ పండుగ ప్రేమ, ఆప్యాయత, రక్షణ మరియు పరస్పర గౌరవానికి ప్రతీక అని ఉపాధ్యాయులు వివరించారు.విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు,ప్రసంగాలతో వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు.పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ మాట్లాడుతూ రాఖీ పండుగ కుటుంబ విలువలు, అనుబంధాలను బలోపేతం చేసే గొప్ప భారతీయ పండుగ అని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి పండుగల ద్వారా మన సంప్రదాయాలను తెలుసుకొని వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాఖీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

## తాళ్లగూడెం లో కోలాహలంగా బోనాల వేడుకలు కంఠమహేశ్వరుడికి పూజలు అలరించిన సాంప్రదాయ నృత్యాలు





**కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :**

కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామంలో గురువారం బోనాల వేడుకలను కోలాహలంగా నిర్వహించారు .శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిపారు.మహిళలు బోనాలతో గ్రామ పుర వీధుల్లో మేళ్ల తాళాలతో డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించి గౌడ కులదైవం అయిన కంఠమహేశ్వరుడికి పూజలు చేసి బోనాలు సమర్పించారు.మొక్కులు కూడా చెల్లించుకున్నారు.సంప్రదాయ నృత్యాలతో అలరించారు.పాడి పంటలు సమృద్ధిగా పండేందుకు వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఘనంగా పండుగ వాతావరణం లో నిర్వహించిన ఈ బోనాల వేడుకలలో గౌడ కుటుంబీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాసిత్ నగర్ లో రహదారిపై నిలిచిన నీరు...గ్రామస్థుల అవస్థలు

**కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :**





కామేపల్లి మండలం బాసిత్ నగర్ లో గురువారం వర్షం కురిసింది.దీంతో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో గ్రామస్థులు,వాహనదారు లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నిలిచిన నీటితో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు.వెంటనే నీటిని తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు.నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులను సైతం సత్వరమే పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. లేని ఎడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ముచ్చర్ల అంగన్వాడి కేంద్రానికి మంచినీటి సదుపాయం

**- సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ**






**కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :**

కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రం -1 కు మంచినీటి సదుపాయం కల్పించనున్నట్లు ఆ పంచాయతీ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ తెలిపారు.అందు కొరకు అవసరమైన పైప్లైన్ పనులను గురువారం నిర్వహించినట్లు తెలిపారు.పనులను త్వరితగతిన పూర్తిచేసి పిల్లలు, తల్లులు, గర్భిణీలకు, అంగన్వాడీ సిబ్బందికి మంచినీటి సదుపాయం కల్పించి ఆదుకోనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామ పంచా యతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పింజరమడుగు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ గ్రామ సభలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామం లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ గ్రామ సభలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఇల్లందు నియోజకవర్గ సర్ కో-ఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వ రరావు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు,ఓబీసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు,కామేపల్లి సొసైటీ అధ్యక్షులు,టీపీసీసీ మెంబర్ పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.సర్పంచ్ గుగులోత్ బాషా అధ్యక్షతన బి ఎల్ ఓ, బిఎల్ఏలతో గ్రామ సభ నిర్వహించారు.సభలో పంచాయతీ కార్యదర్శి గోపిక జాబితాలో పేర్లను చదివి వినిపించారు. అభ్యంతరాలను సైతం వివరించారు.ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ వింజం నాగభూషణం, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ షేక్ ఫతే మహమ్మద్,జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య, బి ఎల్ ఎ పుట్టల వెంకటేష్, బి ఎల్ వో గంపల చిలకమ్మ,జిల్లా నాయకులు నల్లమోతు రవి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు లావుడియా రవి మృతి తీరని లోటు

- రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రామ్ రెడ్డి చరణ్ రెడ్డి





కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :

కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెంది న కాంగ్రెస్ నాయకులు లావుడియా రవి మృతి తీరని లోటు అని, వారి సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి చరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గింజల నరసిం హారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ అన్నారు.గురువారం నిర్వహించిన రవి దశదిన కర్మ కార్యక్రమం లో పాల్గొని రవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.అధైర్య పడద్దని అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మద్దినేని రమేష్ బాబు,మార్కెట్ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, కొత్త లింగాల సర్పంచ్ ఇట్ట శ్రీను,కొత్త లింగాల గ్రామ కమిటీ, గోవింద్రాల సర్పంచ్ బానోత్ కమలా దేవయ్య, ఉపసర్పంచ్ ఆలోత్ తారా శివ, కొమ్మినేపల్లి సర్పంచ్ ధరావత్ అనురాధ, మాజీ సర్పంచ్ అజ్మీర రామదాసు నాయక్, చామంతుల విశ్వనాథం, యువజన కాంగ్రెస్ మండల నాయకులు ఏనూటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చర్ల సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీరామ్ నాగరాజు మృతి

కామేపల్లి, ఆగస్టు 27 మీ వార్త ప్రతినిధి :



కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీరామ్ నాగరాజు (32) గురువారం మృతి చెం దారు.అందుకు సంబంధించిన వివరములు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధప డుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు.నాగరాజు మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.నాగరాజు మృతి తీరని లోటు అని వారి సేవలు మరువలేనివని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.కాగా నాగరాజు అంత్యక్రియలు వారి స్వగ్రామమైన దాచాపురంలో కుటుంబీకులు,బంధువులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు.

## అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ, రవాణా

**మిర్యాలగూడ:** మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేసి, రవాణా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. అవంతిపురం గ్రామ శివారులోని శ్రీ లక్ష్మి గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్ వద్ద పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు 26-08-2026న సాయంత్రం సుమారు 4:30 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించి నిల్వ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర బస్తాల్లో ప్యాక్ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా సుమారు 21 టన్నుల పీడీఎస్ బియ్యం, మొత్తం 420 సంచులు (ఒక్కో సంచి 50 కిలోలు) స్వాధీనం చేసుకున్నారు. అలాగే బియ్యం రవాణాకు ఉపయోగించినట్లు పేర్కొన్న ఐచర్ మినీ డీసీఎం (టా 05 జఈ 6431) వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పరిశ్రమల అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దు.

- టీజీ ఐపాస్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, ఆగస్టు -27,మీ వార్త ప్రతినిధి.





జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతుల మంజూరులో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టీజీ ఐ-పాస్ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో కలిసి పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతుల మంజూరు, పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్ణీత గడువు లోగా మంజూరు చేయాలని, అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గత సమావేశం నుంచి 28 కొత్త యూనిట్లు 64 రకాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా, వాటిలో 32 అనుమతులను నిర్ణీత సమయంలో మంజూరు చేసినట్లు తెలిపారు.అనుమతుల మంజూరులో సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా దరఖాస్తు అనుమతిలో జాప్యం జరిగితే అందుకు గల కారణాలను తప్పనిసరిగా లిఖిత పూర్వకంగా నమోదు చేయాలని ఆదేశించారు.

అనుమతి మంజూరుకు అవసరమైన అదనపు సమాచారం, వివరణలు లేదా ప్రశ్నలను దరఖాస్తుదారులకు స్పష్టంగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. తిరస్కరించే దరఖాస్తుల విషయంలో కూడా తగిన, స్పష్టమైన కారణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు అందినట్లయితే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రూ. 2.58 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు,ఆమోదండీఐపీసీ సమావేశంలో మొత్తం 22 యూనిట్లకు వివిధ పారిశ్రామిక ప్రోత్సాహకాల క్రింద రూ. 2,58,18,743 మంజూరుకు ఆమోదం లభించింది.పెట్టుబడి సబ్సిడీ క్రింద ఎస్టీ కేటగిరీకి చెందిన 8 యూనిట్లకు రూ.1,83,27,581, ఎస్సీ కేటగిరీకి చెందిన 8 యూనిట్లకు రూ. 69,13,112, ఓసీ కేటగిరీకి చెందిన 2 యూనిట్లకు రూ. 2,72,232 ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపారు.వడ్డీ క్రింద ఎస్టీ కేటగిరీకి చెందిన 2 యూనిట్లకు రూ.1,21,509, పవర్ కాస్ట్ క్రింద ఓసీ కేటగిరీకి చెందిన 2 యూనిట్లకు రూ.1,84,309 ప్రోత్సాహకాలకు ఆమోదం లభించింది.పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన పారిశ్రామికవేత్తలకు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల అనుమతుల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీస్ ప్రవీణ్ కుమార్, ఎల్డీఎం రవి ప్రసాద్, ఆర్టీఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముజాహిద్, ఇండస్ట్రీస్ ఏడి నకుల్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పాదయాత్రకు అపూర్వ స్పందన

- రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఐదు లక్షలు ఇస్తున్న ఎమ్మెల్యే మట్టా
- జర్నలిస్టులకు ఇండ్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని సొమ్ములు అడిగే వారిని నమ్మకండి: మట్టా దయానంద్(రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు)
- సుభాష్,బాబాసాహెబ్ విగ్రహాలకు నివాళులు
- భారీ ప్రదర్శన,తహశీల్దార్ కు వినతి
- రాగమయి ను సత్కరించిన టిడబ్ల్యుజెఎఫ్ నేతలు

సత్తుపల్లి ఆగస్టు 27, మీ వార్త అర్ సి





జర్నలిస్టులకు ఇండ్లు ,ఇండ్లస్థలాలు ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ టి.డబ్ల్యు.జె.ఎఫ్.(తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) ఆగస్టు 22 న అమర జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ 78 వ వర్ధంతి నాడు ఆయన జన్మించిన గ్రామమైన ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం,సుబ్లేడు గ్రామంలో గల ఖాన్ విగ్రహం వద్ద ఘనంగా ప్రారంభించిన పాదయాత్ర గురువారం సత్తుపల్లి పట్టణానికి చేరుకుంది.పాదయాత్ర కు స్థానిక జర్నలిస్టులు, బి.ఆర్.ఎస్.,కాంగ్రెస్,సీపీఎం పార్టీల నేతలు,కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పాదయాత్ర బృందం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుండి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ సుభాష్,బాబా సాహెబ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర కమిటి సభ్యులు చిన్నిని బాలు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని మద్దతు తెలిపిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏడాదికి ఐదు లక్షల రూపాయలు బ్యాంక్ లో డిపాజిట్ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్రంలో అలా చేసే ఎమ్మెల్యే కేవలం నేనే అని ఆమె తెలిపారు.

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే దానికి కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు.స్థలం కూడా పరిశీలించామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్ళమని నియోజకవర్గంలో గల అందరు జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్లస్థలాలు ఇచ్చే యోచన చేస్తున్నామని తెలిపారు.అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నేత మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మాకు ఎప్పుడూ జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉందని మా కుటుంబ సభ్యులుగా ఉన్నారని అన్నారు.నిజాలను తెలుసుకొని వార్తలను రాయాలని సూచించారు. ఏ పార్టీలో ప్రజల సంక్షేమం కోసం మట్టా కుటుంబం పరి తపిస్తుందని దయానంద్ స్పష్టం చేశారు.పేదలకు ఇండ్లస్థలాలు మేమే కాలువలు పూడ్పించి ఇస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దని ఇండ్ల స్థలాలు ఇచ్చేది కేవలం మీ ఎమ్మెల్యే మట్టా రాగమయి మాత్రమేనని మోసపోవద్దని అన్నారు.అనంతరం టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ సాధారణ పౌరులుగా నైనా గుర్తించి వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే రాగమయి గళం విప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే జర్నలిస్టుల సంక్షేమాన్ని గుర్తించి సంక్షేమనిధి ఏర్పాటు చేయడం లేదని ఆ ఘనత కేవలం రాగమయి కే దక్కుతుందన్నారు.అనంతరం ఎమ్మెల్యే రాగమయి రాష్ట్ర ఐసిడిఎస్ శాఖ కమిటీ సభ్యురాలుగా ఎంపిక అయినందుకు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖదీర్,కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి లు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం పాల్గొన్న బి.ఆర్.ఎస్.పార్టీ నేతలు,మాజీ పురపాలక సంఘం అధ్యక్షులు కూసంపూడి మహేష్,మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు,మాజీ వార్డు కౌన్సిలర్ మల్లూరు అంకంరాజుల బృందం పాదయాత్ర బృందానికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు పోరాటానికి సంఘీభావం తెలిపారు.అనంతరం సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జాజిరి శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు,ఐద్వా నాయకురాళ్ళు జాజిరి జ్యోతి,కుమారి, సీపీఐఎం ఎల్ మాస్ లైన్ నేత శరత్ లు మద్దతు తెలిపి మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ సమాచారం చేర వేసే జర్నలిస్టులు ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్నారని,ప్రజా సమస్యలను వెలికి తీసి పాలకులను స్పందింప చేసే జర్నలిస్టులు ఇండ్ల స్థలాలు ఇల్లు కావాలని పాదయాత్ర లు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరి కాదని తక్షణమే స్పందించాలని లేకుంటే వామపక్షాలు ప్రత్యక్ష పోరాటంలోకి దిగుతుయాని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక జర్నలిస్టులు షయ బుద్దీన్,బి.వి.రామారావు తదితరులు సంఘీభావం తెలిపారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో: సంఘం నాయకులు చీపీ గంగాధర్,సుధాకర్,మల్లూరు చంద్రశేఖర్,ఆరెంపుల హరిబాబు,అప్జల్,గోదా నాగబాబు లతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మీనాక్షి నటరాజన్ చేతులెత్తేసేరా



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించినప్పుడు.. అధికారంలో ఉన్న పార్టీలో చెలరేగుతున్న ఆధిపత్య పోరును, అసమ్మతులను ఆమె అరికడతారని అధిష్టానం, పార్టీ కేడర్ భావించాయి. రాహుల్ గాంధీ బృందంలో అత్యంత కీలక సభ్యురాలిగా, సాదాసీదా జీవితం గడిపే అవినీతి రహిత నాయకురాలిగా ఆమెకున్న గుర్తింపు తెలంగాణలోని మురా రాజకీయాలను గాడిలో పెడుతుందని భావించారు. అయితే, ఆచరణలో తెలంగాణ కాంగ్రెస్ నేతల స్వయంప్రతిపత్తి, వర్గ రాజకీయాల ముందు ఏఐసీసీ ప్లానింగ్ పూర్తిగా తేలిపోయిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాంధీ భవన్ వేదికగా జరుగుతున్న ఆధిపత్య పోరును, ముఖ్యమంత్రి వర్గానికి, మిగిలిన సీనియర్ నేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రాథమిక దశలోనే పరిష్కరిం చడంలో మీనాక్షి నటరాజన్ వైఖరి అత్యంత మెతకగా ఉందనే అభిప్రాయం బలపడింది. విమర్శలు, వివాదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ సమీక్షలు , అంతర్గత చర్చలు లేదా కమిటీల పేరుతో సమయాన్ని గడపడమే తప్ప .. పార్టీ క్రమశిక్షణను దాటిన బడా నేతలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం ఆమె చేయలేకపోయారు. దీనివల్ల అసమ్మతి నేతలకు ఏఐసీసీ పట్ల భయం లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. అసమ్మతి స్వరాలు పెరిగినప్పుడు రాజీ మార్గాలు వెతకడం వేరు, కఠిన నిర్ణయాలతో పార్టీ లైన్ దాటకుండా చేయడం వేరు. తెలంగాణ కాంగ్రెస్ సంస్కృతికి తగ్గట్లుగా కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడమే ఆమె వైఫల్యంగా కనిపిస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న పట్టు, అదే సమయంలో కేబినెట్ మంత్రులు , పాత తరం కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను సమన్వయం చేయడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైంది. ఒకవైపు మంత్రుల మధ్య అంతర్గత పోరు, కొండా సురేఖ ఎపిసోడ్ వంటి ఘటనలు మీడియా ముందుకు వచ్చి పార్టీ ప్రతిష్టను దిగజార్చుతున్నా.. కేవలం అధిష్టానానికి నివేదికలు పంపడానికే ఇన్‌ఛార్జ్ పరిమితమయ్యారనే కామెంట్లు వస్తున్నా యి. ఈ అంతర్గత బలహీనతల నడుమ, మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా తెలంగాణలోని ఓ ప్రైవేట్ కేసు వివరాల వల్ల రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించింది. ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద ఎదురు దెబ్బగా మారింది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాష్ట్రంలో గ్రూపు రాజకీయా లను నడిపించడంలో ఆమె అనుభవం సరిపోలేదనే సంకేతాలు పంపాయి. రాజ్యసభ అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఢిల్లీ స్థాయిలోనూ, తెలంగాణ నేతల వద్ద కూడా ఆమె రాజకీయ పరపతి మరింత తగ్గిపోయిందనే విశ్లేషణలు సాగుతున్నాయి. కేవలం మంచి ఇమేజ్ , రాహుల్ గాంధీ ఆశీస్సులు మాత్రమే ప్రాంతీయంగా బలంగా ఉన్న వర్గ రాజకీయాలను నియంత్రించలేవు. తెలంగాణ కాంగ్రెస్ మరింత వివాదాల్లోకి వెళ్లకుండా ఉండాలంటే.. మీనాక్షి నటరాజన్ తన మెతక వైఖరి ని వీడి, శస్త్రచికిత్స తరహా కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదా అధిష్టానం ఒక పవర్‌ఫుల్ ప్రత్యామ్నాయ వ్యూహకర్తను రంగంలోకి దించడం తప్ప వేరే మార్గం కనిపించదని అంటున్నారు.